## అవార్డులు రావడం గొప్ప విషయం



బాన్సువాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్, జూన్ 19 : బాన్సువాడ లయన్స్ క్లబ్‌కు రాష్ట్ర స్థాయిలో ఐదు కనెక్టివ్ అవార్డులు రావడం గొప్ప విషయమని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. బాన్సువాడ లయన్స్ క్లబ్‌కు ఐ స్క్రీనింగ్, ఉత్తమ సేవలను గుర్తించి ఐదు విభాగాల్లో కనెక్ట్ అవార్డులు వచ్చినందుకుగాను సోమవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డికి మున్సిపల్ పాలకవర్గం తరఫున సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు వెంకటేశ్, శ్రీనివాస్, నర్సగొండ, హకీం, హైమద్, కోఆప్షన్ సభ్యుడు బాబా, పోచీరాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అవార్డులు రావడం ఆనందంగా ఉంది**

బాన్సువాడ టౌన్, జూన్ 19 : రాష్ట్ర స్థాయిలో బాన్సువాడ లయన్స్ క్లబ్‌కు అవార్డులు రావడం ఆనందంగా ఉందని బాన్సువాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 127 లయన్స్ క్లబ్‌లు ఉండగా బాన్సువాడ లయన్స్ క్లబ్‌కు ఐ స్క్రీనింగ్, ఉత్తమ సేవలను గుర్తించి ఐదు విభాగాల్లో కనెక్ట్ అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. అందుకు సహకరించిన బాన్సువాడ లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రావణ్, కోశాధికారి వెంకటరమణ, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో భోజనం తనిఖీ

బీర్కూర్, జూన్ 19 : మండలకేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో ఎంపీపీ రఘు ఎంఈవో నాగేశ్వర్‌రావుతో కలిసి సోమవారం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు వండిపెట్టాలని, ప్రభుత్వం సూచించిన మెనూ తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలకు ఎన్నో నిధులు ఇస్తున్నదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన విద్యాబోధన చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత, బీఆర్‌ఎస్ నాయకుడు లాడేగాం గంగాధర్ ఉన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

బాన్సువాడ టౌన్, జూన్ 19 : యోగా దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని బాన్సువాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న బాన్సువాడ పట్టణ పరిధిలోని మీనా గార్డెన్‌లో బాన్సువాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమానికి బాన్సువాడ పట్టణ, మండలం పరిధిలోని యోగా ప్రియులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపన్యాస పోటీలు



ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బీర్కూర్, జూన్ 19 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు సీనియర్ అధ్యాపకుడు చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, దేవీసింగ్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా హరితోత్సవం

- హాజరైన స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్యేలు
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు



హరిత హారంలో సాధించిన ప్రగతిని ఫొటోల ద్వారా తిలకిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

కామారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన తెలంగాణ హరితోత్సవం జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగింది. గ్రామగ్రామాన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి మొక్కలు నాటారు. జిల్లాలో ఇప్పటికే లక్ష్యానికి మించి మొక్కలను నాటి రికార్డు సృష్టించిన అధికారులు, సోమవారం నిర్వహించిన హరితోత్సవంలోనూ ఉత్సాహంగా మొక్కలను నాటడంతో మొక్కల సంఖ్య మరింత పెరిగింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొని మొక్కలను నాటారు. బాన్సువాడ నియోజకవర్గంలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఉదయం 9 గంటలకే మాతా శిశు దవాఖానకు చేరుకొని అక్కడ మొక్కలను నాటారు. అనంతరం కామారెడ్డి-బాన్సువాడ రోడ్డు పక్కన మొక్కలను నాటారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన మొక్కలను నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో హరితవిప్లవం వచ్చిందన్నా రు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా చెట్లే కనిపిస్తున్నాయని, దీంతో వర్షాలు సమృద్ధిగా పడుతాయని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేటలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ మొక్కలను నాటారు. కామారెడ్డి నియోజకవర్గంలో భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మొక్కలను నాటి మాట్లాడారు. ఇప్పటి వరకు 8 విడుతల్లో మొక్కలను నాటామన్నారు. రాబోయే రోజుల్లో దీని ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పెద్ద కొడప్‌గల్‌లో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే హన్మంత్ షిండే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం జుక్కల్‌లో ఆక్సిజన్ పార్కును ఎంపీ బీబీ పాటిల్ ప్రారంభించారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ఆక్సిజన్ పార్కు పూర్తయిందని, ఇది రూర్బన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే హన్మంత్ షిండే పేర్కొన్నారు.

**నేడు తెలంగాణ విద్యా దినోత్సవం**

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేసి సభలను నిర్వహిస్తారు. విద్యారంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తారు. విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మన ఊరు-మన బడి పాఠశాలలను ప్రారంభిస్తారు.

## విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కామారెడ్డి/బీర్కూర్, జూన్ 19 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రతి గ్రామంలో విద్యార్థులతో ర్యాలీలు, జాతీయ పతాక ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మన ఊరు మన బడిలో నూతన భవనాలు నిర్మాణం పూర్తి అయినవి ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. బీర్కూర్ మండలకేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి విద్యాదినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానుప్రకాశ్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యారంగంలో జరిగిన అభివృద్ధిని ఆయా మండలాల నివేదికతో అధికారులు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు అవారి గంగారాం, బీఆర్‌ఎస్ నాయకుడు నారాయణ, కొరిమె రఘు, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు సన్మానం

బాన్సువాడ టౌన్, జూన్ 19 : బాన్సువాడలోని ఏరియా దవాఖానలో మెడికల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, దవాఖాన సిబ్బంది మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కమిషనర్ రమేశ్‌ను సోమవారం సన్మానించారు. బాన్సువాడ మున్సిపాలిటీకి ఇన్నోవేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఉత్తమ మున్సిపాలిటిగా ఎంపికై మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నందుకుగాను దవాఖాన సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్, హకీం, నర్సగొండ, రాజాగౌడ్, కిరణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు బాబా, డాక్టర్ సుధా, నర్సింగ్ ఇన్‌చార్జి శాంతాకుమారి, నాయకులు శ్రీనివాస్, ఉదయ్, దావూద్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ను సన్మానిస్తున్న దవాఖాన సూపరింటెండెంట్, దవాఖాన సిబ్బంది

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి

దోమకొండ, జూన్ 19 : దోమకొండ మండల కేంద్రంలోని గోసంగి కాలనీలో అభివృద్ధి పనులకు సోమవారం జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ నల్లపు అంజలీశ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ తన నిధుల కింద గోసంగి కాలనీలో కాలనీ ముఖద్వార నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రభుత్వవిప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, నాయకులు నర్సారెడ్డి, కుంచాల శేఖర్, శంకర్‌రెడ్డి, పోచయ్య, శ్రీనివాస్, షమీ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్



కంచర్లలో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు, జూన్ 19 : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం సందర్భంగా మండలంలోని కంచర్ల గ్రామంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు విప్ గంపగోవర్ధన్‌కు బోనాల ఊరేగింపుతో స్వాగతం పలికారు. అనంతరం రూ.96 లక్షల 20 వేలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హరితోత్సవం సందర్భంగా గ్రామం లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, రూ.23 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు, పలు కుల సంఘ భవనాలను ప్రారంభించారు. గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీపీ గాల్‌రెడ్డి, జడ్పీటీసీ పద్మ, సర్పంచ్ చంద్రకళ, మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, విండో చైర్మన్ రాజాగౌడ్, ఎంపీటీసీ సాయాగౌడ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మాధవి, మండల కన్వీనర్ రాంచంద్రం, మాజీ సర్పంచ్ చంద్రం, బీఆర్‌ఎస్ నాయకులు సతీశ్‌రెడ్డి, నర్సింహులు, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రనిధులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి

బీబీపేట్, జూన్ 19: మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు కోరారు. తహసీల్దార్ నర్సింహులుకు విద్యార్థి సంఘం నాయకులు కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో డాక్టర్ సంతోష్‌గౌడ్, సతీశ్, ప్రమోద్, మోహన్, హరిప్రసాద్, సంతోష్, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.